క్లుప్తంగా

మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు మృతి


సత్యనారాయణ మూర్తి(ఫైల్)

ముమ్మిడివరం: అయినవిల్లి మండలం క్రాప పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు గంజి సత్యనారాయణమూర్తి(96) అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందారు. ఆయనకు భార్య రామలక్ష్మి, ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఆయన మృతికి పలువురు నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

ముగిసిన క్రీడా పోటీలు


క్రీడాప్రాధికారి సంస్థ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద నిర్వహించిన ర్యాలీ

అమలాపురం రూరల్: అంబేడ్కర్ కోనసీమ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి 10 నుంచి మార్చి 25 వరకు నిర్వహించిన క్రీడా పోటీలు శనివారం ఘనంగా ముగిశాయి. చివరి రోజైన శనివారం కలెక్టరేట్ వద్ద ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి ర్యాలీని ప్రారంభించి మాట్లాడుతూ మహిళలకు వివిధ అంశాల్లో క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కుడిపూడి భాగ్యలక్ష్మి, హితకారిణి సమాజం చైర్‌పర్సన్ కాశీ మునికుమారి, పట్టణ వైఎస్సార్ సీపీ సంసాని చంద్రశేఖర్, జిల్లా వక్ఫ్ బోర్డ్ చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్, డీఆర్‌డీఏ పీడీ శివశంకర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వర్ధంతి సభ

ఉప్పలగుప్తం: మండలంలోని భీమనపల్లి పంచాయతీ పరిధి సింగరాయపాలెం ప్రాథమిక పాఠశాలలో యుటీఎఫ్ వ్యవస్థాపకులు అప్పారి వెంకటస్వామి, వత్సవాయి సూర్యనారాయణరాజుల వర్ధంతి సభను ఉపాధ్యాయులు శనివారం నిర్వహించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అమలాపురం రూరల్: ఈదరపల్లిలో 33/11 విద్యుత్ సబ్‌స్టేషన్, బాలయోగి ఘాట్ సబ్‌స్టేషన్లలో మరమ్మతుల నిమిత్తం పట్టణ, రూరల్ పరిధిలో ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని విద్యుత్ శాఖ ఈఈ మోకా రవికుమార్ తెలిపారు. ఆదివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు బాలయోగి ఘాట్ ఫీడర్, విద్యుత్ నగర్, వనచర్లవారి వీధి, ఏఎంజీ కాలనీ, చేపల మార్కెట్, గోల్డ్ మార్కెట్, ఈదరపల్లి శివాలయం ఏరియా, సుబ్బారాయుడు చెరువు, వడ్డిగూడెం, వడ్లమానివారివీధి, శ్రీరామ్‌నగర్, భూపయ్య అగ్రహారం, గోపాలకృష్ణ వీధి, తారకరామనగర్, ఇందుపల్లి బండారులంక తదితర ప్రాంతాల్లో విద్యుత్ నిలిపోనుందని చెప్పారు.

ఏటీఎం గ్లాస్ డోర్ ధ్వంసం

యానాం: యానాం పట్టణ పరిధిలోని పడవలరేవు వీధిలో మతిస్థిమితం లేని ఒక వ్యక్తి బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏటీఎం గ్లాస్ డోర్‌ను శనివారం సాయంత్రం ధ్వంసం చేశాడు. గత కొన్నినెలలుగా అతడు రాత్రి వేళల్లో ఏటీఎం కేంద్రంలోనే నిద్రిస్తుండడంతో డబ్బులు విత్‌డ్రా కోసం వచ్చిన వినియోగదారులు భయపడి బ్యాంకుకు ఫిర్యాదు చేశారు. దీంతో ఇటీవల రాత్రివేళల్లో ఏటీఎం షట్టర్‌ను మూసేస్తుండడంతో ఆగ్రహానికి గురైన సదరు మతిస్థిమితం లేని వ్యక్తి గ్లాస్ డోర్‌ను బద్దలుకొట్టినట్లుగా తెలుస్తుంది. దీనిపై బ్యాంకు సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మాజీ ఎమ్మెల్యే దాట్ల పరామర్శ

తాళ్లరేవు: గాడిమొగ పంచాయతీ మాజీ సర్పంచ్ లంకే రాముడును ముమ్మిడివరం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు శనివారం పరామర్శించారు. రాముడుకు ఇటీవల గుండెపోటు రావడంతో స్టంట్ వేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న నేపథ్యంలో పరామర్శించి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట వాడ్రేవు వీరబాబు, మందాల గంగ సూర్యనారాయణ, టి.లక్ష్మణరావు తదితరులున్నారు.

ఇజ్రాయిల్‌కు అభినందనలు

తాళ్లరేవు: ఇటీవల జరిగిన ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించిన బొమ్మి ఇజ్రాయిల్‌ను జార్జిపేట గ్రామ పంచాయతీకి చెందిన వ్యవసాయశాఖ విశ్రాంత డైరెక్టర్ పెట్ల సూర్యనారాయణరాజు, శాంతకుమారి దంపతులు శనివారం కలిసి దుశ్శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు.

ఘనంగా బాపనయ్య వర్ధంతి

తాళ్లరేవు: తాళ్లరేవు ప్రజాసంఘాల భవనంలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఉద్యమ నిర్మాత గుంటూరు బాపనయ్య వర్ధంతిని సంఘం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. బాపనయ్య ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీకి మూడుసార్లు శాసనసభ్యునిగా, ఒకసారి శాసనమండలి సభ్యునిగా పనిచేశారని, ఆయన సేవలు ఎనలేనివని కొనియాడారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి కేఎస్ శ్రీనివాస్, టేకుమూడి ఈశ్వరరావు, అదృష్టదీపుడు, తణుకురాజు తదితరులు పాల్గొన్నారు.

అక్కా చెల్లెమ్మలకు ఆసరా

- ప్రారంభమైన మూడో విడత నగదు విడుదల
- రెండు నియోజవర్గాల్లో 7927 గ్రూపులకు రూ.67 కోట్ల సాయం


అమలాపురం మండలంలో డ్వాక్రా మహిళలకు బొట్టుపెట్టి నిధుల విడుదల పత్రాలు అందిస్తున్న వీఓఏలు

అమలాపురం రూరల్: అక్కా చెల్లెమ్మలకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఆసరాగా నిలుస్తుంది. ప్రజా సంకల్ప పాదయాత్రలో అక్కచెల్లెమ్మలకు ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన వెంటనే ఆసరా డ్వాక్రా రుణమాఫీ పథకాన్ని ప్రవేశపెట్టి ఆర్థిక సాయం అందచేస్తున్నారు. డ్వాక్రా సంఘాలపై 2019 నాటికి ఉన్న రుణ నిల్వలన్నీ నాలుగు వాయిదాల్లో ప్రభుత్వమే పూర్తిగా చెల్లిస్తుంది. ఇప్పటికే రెండు విడతల్లో ఆసరా సాయాన్ని అందించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పశ్చిమగోదావరి జిల్లా దెందులూరులో శనివారం మూడో విడత ఆసరా ఆర్థిక సాయాన్ని అక్కచెల్లెమ్మల ఖాతాల్లో జమ చేయడాన్ని లాంఛనంగా ప్రారంభించారు. వచ్చే నెల 10వ తేదీ లోపు అర్హత కలిగిన డ్వాక్రా గ్రూపులన్నింటికీ ఆయా ఖాతాల్లో రుణమాఫీ సొమ్ము జమ కానుంది.

మూడో విడత ఆసరా చెల్లించేందుకు లబ్ధిదారుల బయోమెట్రిక్‌ల సేకరణ ఇప్పటికే ప్రక్రియ పూర్తయింది. స్థానికంగా ఉండే వీఓఏలు డ్వాక్రా మహిళలకు బొట్టుపెట్టి నిధుల విడుదల పత్రాలు అందిస్తున్నారు. అమలాపురం నియోకవర్గంలో 3 మండలాల్లోను 4,425 గ్రూపులకు గాను, రూ.37.01 కోట్లు మూడో విడతగా ఇవ్వనున్నారు. ముమ్మిడివరం నియోకవర్గంలోని 3 మండలాల్లోని 3502 గ్రూపులకు గాను, రూ. 24.59 కోట్లు అందించనున్నారు. రెండు నియోజవర్గాల్లో కలిపి మొత్తంగా 7,927 గ్రూపులకు గాను రూ.67 కోట్లు జమ చేయనున్నారు. పది రోజుల పాటు వైఎస్సార్ ఆసరా ఉత్సవాలను నిర్వహించి డ్వాక్రా సంఘాల అకౌంట్లకు మాఫీ సొమ్ములను ప్రభుత్వం జమ చేయనుంది.

వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా అందించనున్న సాయం వివరాలు

మండలం	గ్రూపులు	అందించనున్న మొత్తం(రూ.కోట్లలో)
అమలాపురం	1817	16.34
ఉప్పలగుప్తం	1244	9.20
అల్లవరం	1364	11.47
ముమ్మిడివరం	980	7.07
కాట్రేనికోన	1351	8.98
ఐ.పోలవరం	1171	8.53

మహిళలకు ఎంతో మేలు



ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం డ్వాక్రా సంఘాల మహిళలకు వైఎస్సార్ ఆసరా పథక సాయాన్ని మూడో విడత జమ చేయడం హర్షణీయం. ఈ పథకం మహిళల ఆర్థిక స్వావలంబనకు ఎంతో మేలు చేస్తుంది.
– వాసంశెట్టి వరలక్ష్మి, డ్వాక్రా మహిళ, సాకుర్రు, అమలాపురం మండలం

అర్హులందరికీ వర్తింపు



డ్వాక్రా సంఘాల్లో ఉన్న అర్హులైన మహిళలందరికీ వైఎస్సార్ ఆసరా పథకాన్ని వర్తింపజేశాం. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం నాలుగు విడతల్లో ఆసరా పథకాన్ని వర్తింపజేస్తున్నారు.
– పీవీవీ రమణి, వైఎస్సార్ క్రాంతి పథం, ఏపీఎం, అమలాపురం రూరల్ మండలం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ఇచ్చిన మాటను నిలబెట్టుకుని మూడో విడత మాఫీ సొమ్మును విడుదల చేయడంపై మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం


సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న సర్పంచ్ ఊర్మిళాదేవి తదితరులు

ఉప్పలగుప్తం: వైఎస్సార్ ఆసరా మూడో విడత లబ్ధి చేకూర్చినందుకు కృతజ్ఞతగా మండల పరిధిలోని విలసవిల్లి పంచాయితీ కార్యాలయం వద్ద ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి మహిళలు క్షీరాభిషేకం చేశారు. స్థానిక సర్పంచ్ ఊర్మిళాదేవి ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలతో సమావేశం నిర్వహించారు. అనంతరం మహిళలు ముఖ్యమంత్రి జగన్‌పై తమకున్న అభిమానాన్ని క్షీరాభిషేకం ద్వారా చాటుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఊర్మిళాదేవి మాట్లాడుతూ జగనన్న ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం డ్వాక్రా మహిళలకు మూడో విడత ఆసరా విడుదల చేయడం హర్షణీయమన్నారు. గ్రామంలో 80 డ్వాక్రా సంఘాలకు రూ.73.91 లక్షల మేర లబ్ధి చేకూరిందని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్, ఎంపీడీవో కేఎస్ గౌరీకుమారి, పార్టీ నాయకులు కోలా ఏసు, దాసరి శర్మ, బళ్ళ నాగసతీష్, ఆశపు బుజ్జి, కర్రా చిన్న, పంచాయతీ కార్యదర్శి దాసరి కృష్ణాజీ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీలకు ఆదాయ వనరులవి


చెత్త నుంచి సంపద సృష్టించడంపై అవగాహన కల్పిస్తున్న కోఆర్డినేటర్ మధు

అల్లవరం: చెత్త నుంచి సంపద కేంద్రాలు పంచాయతీలకు ఆదాయ వనరులుగా మారుతున్నాయని సర్పంచ్ రాకాపు విజయలక్ష్మి అన్నారు. కొమరగిరిపట్నం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో అల్లవరం మండలంలోని గుండెపూడి, గోడి, ఉప్పలగుప్తం మండలంలో భీమనపల్లి, ఉప్పలగుప్తం గ్రామాల సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం కోఆర్డినేటర్ మధు మాట్లాడుతూ చెత్త నుంచి సంపద ఎలా సృష్టించుకోవాలో అవగాహన కల్పించారు. గ్రామాల్లో తడి, పొడి చెత్తను వేరు చేసి సాలిడ్ వేస్ట్ ప్రోసెసింగ్ కేంద్రాలకు తరలించి వర్మీ కంపోస్టుని తయారు చేస్తారన్నారు. అలా తయారుచేసిన వర్మీ కంపోస్టుని మార్కెట్ చేసి పంచాయతీలకు ఆదాయం సమకూర్చుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో కార్యదర్శులు ఎస్‌వీవీ సత్యనారాయణ, రాజమోహన్, పి.శ్రీనివాస్, తిక్కిరెడ్డి రామకృష్ణ, పి.నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

భూపరిహారానికి గజాల్లో ధర నిర్ణయించాలి


భూపరిహారంపై ఆర్డీఓతో ఫోన్లో మాట్లాడుతున్న ఎంపీ అనురాధ

అల్లవరం: జాతీయ రహదారి–216 విస్తరణ కోసం సేకరిస్తున్న భూమికి చదరపు గజాల్లో ధర నిర్ణయించి పరిహారం చెల్లించాలని పాశర్లపూడి గ్రామస్తులు ఎంపీ అనురాధని శనివారం కలిసి వినతిపత్రం అందించారు. ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న భూములకు కొందరికి సెంట్లు, మరికొందరికి గజాల్లో ధరలు నిర్ణయిస్తున్నారని, అందరికీ ఒకేలా పరిహారం ఇవ్వాలని ఎంపీని కోరారు. ఎంపీ అనురాధ ఈ విషయంపై ఆర్డీఓ వసంతరాయుడుతో ఫోన్లో మాట్లాడి విస్తరణకు భూయజమానులందరికీ ఒకేలా పరిహారం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎంపీని కలిసినవారిలో కేవీవీ సత్యనారాయణ, జి.లక్ష్మణరావు, ఎస్.వెంకటేశ్వరరావు, జి.శ్రీనివాస్, వాకపల్లి శ్రీనివాస్, ఎస్.అప్పాజీ, తోట గంగాధరరావు తదితరులున్నారు.

రాగి జావ కోసం విద్యార్థులకు గ్లాసుల పంపిణీ


విద్యార్థులకు గ్లాసులు పంపిణీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్ నాయుడు, డాక్టర్ మూర్తి తదితరులు

అమలాపురం టౌన్: పట్టణంలోని 27వ వార్డులోని పుచ్చలపల్లి సుందరయ్య మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు రాగి జావ తాగేందుకు వీలుగా ఐఎంఏ కోనసీమ శాఖ అధ్యక్షుడు డాక్టర్ వీవీఎస్ఎన్ మూర్తి 100 స్టీలు గ్లాసులను వితరణగా సమకూర్చారు. పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు సాయి శ్రీనివాస్ అధ్యక్షతన శనివారం జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు చేతుల మీదుగా విద్యార్థులకు గ్లాసులను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మూర్తిని కమిషనర్ నాయుడు, స్థానిక వార్డు కౌన్సిలర్ బండారు గోవిందు, వైఎస్సార్ సీపీ నాయకుడు శ్రీనివాస్ తదితరులు అభినందించారు.

నూరు శాతం మార్కులు సాధించాలి


అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో సరస్వతి దేవి పూజలో పాల్గొన్న ఎంపీపీ, జెడ్పీటీసీ, విద్యార్థులు, ఉపాధ్యాయులు

అంబాజీపేట: ఉపాధ్యాయుల ప్రోత్సాహం, విద్యార్థుల కృషి, సరస్వతి దేవి అనుగ్రహంతో పదో తరగతిలో నూరు శాతం మార్కులు సాధించాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు కొర్లపాటి కోటబాబు అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో హెచ్ఎం బీర హనుమంతరావు అధ్వర్యంలో సరస్వతీ దేవి పూజను శనివారం ఘనంగా నిర్వహించారు. పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు ఈ పూజలను వైభవంగా జరిపారు. స్థానిక పాఠశాలలో ఉన్న సరస్వతీదేవి విగ్రహం ముందు పరీక్ష అట్టలు, పెన్నులను ఉంచి భక్తిశ్రద్ధలతో కొలిచారు. సరస్వతీదేవి విగ్రహదాత మాజీ సర్పంచ్ కొర్లపాటి సుబ్రహ్మణ్యవరప్రసాద్‌రావు కుమారుడు కోటబాబు పర్యవేక్షణలో అర్చకులు ఈ పూజలను నిర్వహించారు. అనంతరం ఎంపీపీ వెంకటేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు కోటబాబు సమకూర్చిన పెన్నులను పూజలో ఉంచి 130 విద్యార్థులకు పంపిణీ చేశారు. విద్యార్థులకు హాల్ టికెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఎంసీ చైర్మన్ అరిగెల రామతులసి, సూదాబత్తుల రాము, కామిశెట్టి మధుబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాలు నిర్మాణానికి రూ.3 కోట్లు

పార్టీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయినకు సీఎం జగన్ హామీ


ముఖ్యమంత్రి జగన్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

అమలాపురం టౌన్: ఏలూరు జిల్లా దెందులూరు పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి జగన్‌ను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ ఆధ్వర్యంలో అమలాపురానికి చెందిన వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అమలాపురం సూర్యనగర్‌లోని కమ్యూనిటీ హాలు శిథిలావస్థకు చేరుకున్న విషయాన్ని సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్లి నిధులు కేటాయించాలని కోరారు. కమ్యూనిటీ హాలు నిర్మాణం కోసం రూ.3 కోట్ల నిధులు మంజూరుకు సీఎం జగన్ హామీ ఇచ్చినట్లు శ్రీనివాసరావు తెలిపారు.

సంపూర్ణ శ్రీమద్రామాయణ ప్రవచనాలు


ప్రవచనాలు వివరిస్తున్న సీతారామశర్మ

కొత్తపేట: స్థానిక హరిహర దేవాలయ ప్రాంగణంలో యువ వేదపండితుడు దెందులూరి సీతారామశర్మ 'సంపూర్ణ శ్రీమద్రామాయణం' పురాణ ప్రవచనాలు కార్యక్రమాన్ని 42 రోజుల పాటు ప్రతిరోజూ రాత్రి నిర్వహిస్తున్నారు. ఈ నెల 23 నుంచి దీనిని ప్రారంభించారు. ఉమాకొప్పేశ్వర పురాణ ప్రవచన కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. భక్త రామదాసు మేనమామలైన అక్కన్న, మాదన్నలు నిర్మించిన హరిహరదేవాలయ ప్రాంగణంలో మే నెల 3 వరకూ 42 రోజులు పాటు ప్రతీ రోజు సాయంతంరం 6.30 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకూ సీతారామశర్మ ఒక్కో రోజు రాత్రి ఒక్కో అంశంగా 'సంపూర్ణ శ్రీమద్రామాయణం' ప్రవచనాలు చెబుతారు. 42వ రోజు సీతారామచంద్రస్వామివారి కల్యాణోత్సవం, పట్టాభిషేకం, ఫలశృతి కార్యక్రమాలు వైభవంగా నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

పన్ను వసూలు నిలిపేయాలంటూ ధర్నా


అన్నంపల్లి టోల్‌ప్లాజా వద్ద ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

ముమ్మిడివరం: ముమ్మిడివరం మండలం అన్నంపల్లి వద్ద 216 జాతీయ రహదారిపై ఏర్పాటుచేసిన టోల్‌ప్లాజా వద్ద పన్ను వసూలు చేయడాన్ని నిలిపేయాలంటూ సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించారు.

ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గతంలో హైవే పనులు పూర్తి చేయకుండా టోల్ వసూలు చేయడాన్ని ఆపాలంటూ జిల్లా కలెక్టర్, హైవే అధికారులకు వినతి పత్రాలు అందించామన్నారు. బట్నవిల్లి నుంచి పేరూరు వరకు బైపాస్ రోడ్డు నిర్మాణం జరగలేదని, అయినా పన్ను వసూలు చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్ఐ కె.సురేష్‌బాబు ఆందోళనకారులతో చర్చించడంతో నిరసన విరమించారు. ధర్నాలో సీపీఎం నాయకులు జి.దుర్గాప్రసాద్, పి.వసంతకుమార్, సఖిలే సూర్యనారాయణ, కుడిపూడి రాఘవమ్మ, పాము బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ అనురాధని కలిసిన డేవిడ్‌రాజు


ఎంపీ అనురాధకు మొక్క అందజేస్తున్న డేవిడ్‌రాజు

అల్లవరం: మొగళ్ళమూరులోని నివాసంలో ఎంపీ చింతా అనురాధను వైఎస్సార్ సీపీ నేత గొల్లపల్లి డేవిడ్‌రాజు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఆమెకు మొక్క అందించి దుశ్శాలువాతో సత్కరించారు. ఆయనకు ఎంపీ అనురాధ శుభాకాంక్షలు తెలిపారు.

కోనసీమ ఆహారనిధి సేవలు అభినందనీయం


పోసాని కృష్ణమురళీకి డొక్కా సీతమ్మ చిత్రపటాన్ని బహూకరిస్తున్న దృశ్యం

అమలాపురం టౌన్: కోనసీమ ఆహారనిధి సంస్థ ఆకలితో అలమటించే వారికి అందిస్తున్న సేవలు అభినందనీయమని సినీ పరిశ్రమకు చెందిన పలువురు ప్రముఖులు ప్రశంసించారు. నటుడు తనికెళ్ల భరణి, ఏపీఎఫ్‌డీసీ చైర్మన్ పోసాని కృష్ణమురళీ, సినీ దర్శకుడు చంద్రమహేష్‌లను కోనసీమ ఆహారనిధి సభ్యుల బృందం సంస్థ ఐదో వార్షికోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా వారికి కోనసీమ ఆహారనిధి వ్యవస్థాపక అధ్యక్షుడు వీరంశెట్టి సతీష్, సభ్యులు బండారు సురేష్, మిండగుదుటి కాసుమణి తదితరులు అన్నదాత డొక్కా సీతమ్మ చిత్రపటాలను బహూకరించారు.

మహిళా సంఘాలకు రూ.8.98 కోట్లు మంజూరు

కాట్రేనికోన: కాట్రేనికోన మండలంలోని 1351 స్వయం సహాయక మహిళా సంఘాలకు వైఎస్సార్ ఆసరా మూడో విడతగా సుమారు రూ.8.98 కోట్లు మంజూరైందని, ఏప్రిల్ 4న మూడో విడత సొమ్ము జమవుతుందని ఎంపీడీఓ కామేశ్వరరావు అన్నారు. కాట్రేనికోన రైతు భరోసా కేంద్రం వద్ద ఏపీఓ వెంకటేశ్వరరావు అధ్యక్షతన మహిళా సమాఖ్య సంఘాల సమావేశం జరిగింది. పశ్చిమగోదావరి జిల్లాలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఆసరా మూడో విడత సాయం లాంఛనంగా ప్రారంభించిన కార్యక్రమాన్ని మహిళలు టీవీ ప్రసారాల ద్వారా వీక్షించారు.

ముఖ్యమంత్రి జగన్‌కు కృతజ్ఞతలు


సీఎం జగన్ ప్రసంగం అనంతరం కృతజ్ఞతలు తెలుపుతున్న తుమ్మలపల్లి డ్వాక్రా మహిళలు

అల్లవరం: ఏప్రిల్ 4న రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ చేతుల మీదుగా మండల డ్వాక్రా సంఘాలకు వైఎస్సార్ ఆసరా మూడో విడత సాయం పంపిణీ కార్యక్రమం జరుగుతుందని ఏపీఎం సయ్యద్ శనివారం తెలిపారు.

ఏలూరు జిల్లా దెందులూరులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మూడో విడత వైఎస్సార్ ఆసరా పంపిణీ ప్రారంభ కార్యక్రమాన్ని డ్వాక్రా సంఘ సభ్యులు టీవీల్లో వీక్షించారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్‌కు డ్వాక్రా మహిళలు కృతజ్ఞతలు తెలిపారు.

పుస్తకాలు, అట్టల పంపిణీ

పి.గన్నవరం: నరేంద్రపురంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఓఎన్‌జీసీ ఎస్సీ, ఎస్టీ ఆల్ ఇండియా ఎంప్లాయిస్ మాజీ చైర్మన్ అంబటి సత్యనారాయణ ఆర్థిక సాయంతో జనని ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం పుస్తకాలు, అట్టలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా పాఠశాల అధ్యాపక సిబ్బంది సత్యనారాయణను దుశ్శాలువాతో సత్కరించారు.

ఎన్ఎంఎంఎస్‌కు విద్యార్థుల ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం వెంకటేశ్వరరావు తదితరులు


ఉపకార వేతనాలకు ఎంపికైన విద్యార్థులతో సర్పంచ్, ఉపాధ్యాయులు

అమలాపురం టౌన్: నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్ షిప్(ఎన్ఎంఎంఎస్)కు అమలాపురంలోని మున్సిపల్ ఉన్నత పాఠశాలలకు చెందిన ఇద్దరు ఎనిమిదో తరగతి విద్యార్థులు ఎంపికయ్యారు. స్థానిక కొంకాపల్లి జవహర్‌లాల్ నెహ్రూ మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఆర్ఎస్ రేవతి, మహాత్మాగాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థి వాడపర్తి నిశాంత్ రామ్ సాయి ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికై నట్లు ఆ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కె.ఘన సత్యనారాయణ, బి.కామేశ్వరరావులు శనివారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఈ విద్యార్థులకు ఏటా రూ.12 వేలు చొప్పున నాలుగేళ్ల పాటు స్కాలర్ షిప్ అందుతుందని పేర్కొన్నారు. విద్యార్థులను మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు అభినందించారు.

14 మంది విద్యార్థుల ఎంపిక

కాట్రేనికోన: జాతీయ స్కాలర్ షిప్(ఎన్ఎంఎంఎస్)కు కాట్రేనికోన మండలానికి చెందిన 14 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. వారిలో 10 మంది విద్యార్థులు కాట్రేనికోన జెడ్పీహెచ్ పాఠశాలకు చెందినవారే కావడం విశేషం. విద్యార్థులకు ఏటా రూ.12 వేలు చొప్పున నాలుగేళ్ళ పాటు ఉపకార వేతనం లభించనుంది. ఈ సందర్భంగా కాట్రేనికోన జెడ్పీహెచ్ పాఠశాలలో స్కాలర్‌షిప్‌కు ఎంపికైన 10 మంది విద్యార్థులు, వారికి శిక్షణ అందించిన సైన్స్ ఉపాధ్యాయుడు లంకే హేమ శ్రీనివాసరావును ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వరరావుతో పాటు సహచర ఉపాధ్యాయులు అభినందించారు.

పాలగుమ్మి విద్యార్థుల ఎంపిక

అమలాపురం రూరల్: ఎన్ఎంఎంఎస్ ఉపకార వేతనాలకు పాలగుమ్మి జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు మోహిత లక్ష్మీసౌమ్య, లోకేష్‌లు ఎంపికయ్యారు. విద్యార్థులను పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్‌పర్సన్ కుడిపూడి యోగీశ్వరి, ఎంపీటీసీ సభ్యురాలు పాలగుమ్మి విజయవాసు, సర్పంచ్ కుడిపూడి రామలక్ష్మి, ఉపసర్పంచ్ కాట్రు వసంత్‌కుమార్ అభినందించారు.

పోలియో రహిత సమాజమే రోటరీ లక్ష్యం

రాజోలు: పోలియో రహిత సమాజమే రోటరీ లక్ష్యమని రోటరీ క్లబ్ గవర్నర్ వి.భాస్కర్‌రామ్ అన్నారు. రాజోలు రోటరీ క్లబ్ సమావేశ మందిరంలో రాజోలు, మలికిపురం, అమలాపురం, ముమ్మిడివరం మండలాల రోటరీ క్లబ్‌ల కార్యవర్గంతో ఆయన సమావేశమయ్యారు. ప్రపంచ వ్యాప్తంగా గత 35 ఏళ్లుగా పోలియో నిర్మూలన కోసం రోటరీ ఎనలేని కృషి చేసిందన్నారు. అసిస్టెంట్ గవర్నర్ మొహిద్దీన్ కిష్వర్, రాజోలు రోటరీ క్లబ్ అధ్యక్షుడు దార్ల పెదబాబు, కార్యదర్శి లక్కింశెట్టి చిన్మయుడు, నామన షణ్ముఖేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా బిల్లు చరిత్రాత్మకం

కొత్తపేట: దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించే దిశగా అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టడం ఒక చరిత్రాత్మక నిర్ణయమని ఆంధ్రప్రదేశ్ బిషప్స్ కౌన్సిల్ (ఏపీబీసీ) చైర్మన్ డాక్టర్ ఎలమంచిలి ప్రవీణ్ అన్నారు. మండలంలోని వాడపాలెం ప్రేయర్ పవర్ చర్చ్‌లో శనివారం బిషప్స్ కౌన్సిల్ ప్రతినిధులు సమావేశమయ్యారు. ఏపీబీసీ జిల్లా అధ్యక్షుడు బిషప్ అడపా ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో చైర్మన్ డాక్టర్ ప్రవీణ్, అధ్యక్షుడు బిషప్ బాలరాజు, ప్రధాన కార్యదర్శి బిషప్ వానాల డేవిడ్‌రాజు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ శుక్రవారం అసెంబ్లీలో సీఎం జగన్ మోహన్‌రెడ్డి దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా బిల్లును ప్రతిపాదించడం ఒక చారిత్రాత్మక నిర్ణయం కాగా శాసనసభ మొత్తం ఏకగ్రీవంగా ఆమోదించడం అభినందనీయమన్నారు. 'కులం పుట్టుకతో వస్తుంది' 'మతం మధ్యలో వస్తుంది'' అని గుర్తించి అసెంబ్లీలో ఏకగ్రీవంగా తీర్మానం చేసి, సుప్రీంకోర్టులో కేసుకు సంబంధించి ప్రభుత్వం తరఫున ఇంప్లీడ్ అయ్యి వాదనలు వినిపిస్తామనడంపై క్రైస్తవలోకం మొత్తం సీఎంకు కృతజ్ఞతలు తెలియజేస్తుందన్నారు. ఈ దళిత క్రైస్తవ బిల్లు చరిత్రలో నిలిచిపోతుందన్నారు. ఈ మేలును ఏ దళిత క్రైస్తవుడు మరువడని అన్నారు. కార్యక్రమంలో సెంట్రల్ కమిటీ మెంబర్ ఆర్చ్ బిషప్ జె.జార్జ్ పాపఫ్, బిషప్ కౌన్సిల్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.